# వైరాగ్యము

అభ్యాసులలో వివేకము వృద్ధిచెందుటకు దృఢసంకల్పము కావలెను. వివేక వైరాగ్యములు ఒకదానితో ఒకటి ముడిపడి వుండును. సాంప్రదాయంలో వీటిని జ్ఞాన వైరాగ్య భూషణములుగా పేర్కొనడం జరిగింది. జ్ఞానమని పిలువబడే వివేకం మరియు వైరాగ్యములు లేకుండా మనం ఆధ్యాత్మికమార్గంలో ముందుకుపోలేము. కొంతమంది అభ్యాసీలు ఈ విలువలను తాము పెంపొందించుకోలేక పోతున్నామనో లేక తమంతతాముగా తమ సంకల్పశక్తితో పెంపొందించుకొనుటకు బదులుగా ఈ విలువలను ఏదో ఒక శక్తి తమకు అనుగ్రహిస్తుందనో ఆశించేవారు సాధారణంగా సాధనలో వైఫల్యం చెందుతారు. మన పని మనం చేసినప్పుడే గురు సహాయం లభిస్తుంది.

కొందరు అభ్యాసీలు "నేను కేవలం తగినంత అనుబంధముతో తృప్తి పడలేకపోతున్నాను", దాన్నే మరొకవిధంగా చెప్పాలంటే "నేనింకా తగిన అనుబంధము పెంపొందించుకోవాలి" అని చెబుతుంటారు. అయితే మనం గమనించవలసిన అంశం ఏమంటే తగిన అనుబంధము పెంపొందించుకోవడం అంటూ ఏమీ ఉండదు. ప్రస్తుతము మనం అనుచిత వ్యామోహంలో తగుల్కొని వున్నాము. ఆ అనుచిత వ్యామోహాన్ని గాని తగ్గించుకోగలిగితే అదే తగిన అనుబంధ మవుతుంది. ఉన్నది ఒకే అనుబంధం, అది దివ్యత్వంతోడి బంధం. అది దివ్యానుబంధం. అది తక్కిన అన్ని బంధాలను ఉచిత బంధం అని తెలుపబడేవిధంగా వాటిని వాటి హద్దుల్లో వుంచుతుంది.

మనం ఆధ్యాత్మికతలో పొందవలసిన వివేకం ఏమిటి? మనం పొందవలసిన వివేకం ఏమిటంటే ఈ ప్రపంచంలోగల ప్రతీదీ ఆయనదే. అంటే భగవంతునిదే. ఈ ప్రపంచంలోని ఏ వస్తువును, వ్యక్తిని స్వంతంచేసుకొనే హక్కు, అధికారం ఏ ఒక్కనికీ లేవు. భగవంతుడు సర్వవ్యాపి. ఈ సమస్త జగత్తుకూ ఆయనే ప్రభువు అనే అవగాహనా లోపంవల్లే వస్తువులపైనా వ్యక్తులపైనా మమకార బంధం ఏర్పడే సమస్య ఉత్పన్నమయింది. ఇక్కడున్న ప్రతీదీ కూడా దివ్యత్వానికే స్వంతం, మనం దేనికీ స్వంతదారులం కాదు. ఇక్కడి ఈ భూమంతా ప్రభుత్వానిదే. ఏ భూమయినా సరే మనం కొనుక్కున్న భూమైనా సరే మనం దానికి ప్రతి సంవత్సరం పన్ను కడుతున్నా, నీటి తీరువా కడుతున్నా, ఆ భూమంతా ప్రభుత్వానిదే. ఎవరూ భూమిని స్వంతం చేసుకోలేరు. భూమి ప్రభుత్వానికే స్వంతం. ఎప్పుడైనా దానిని స్వాధీన పరచుకోవచ్చు. ఈ భావన మనలో చాలామందికి స్పష్టమయిందనే అనుకొంటాను. అదేవిధంగా యిక్కడున్న ప్రతిదానికీ అధిపతి భగవంతుడే. కనుక మనం దేన్నయినా స్వంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లయితే ఆయనకు సంబంధించిన దానిని దురాక్రమణ చేస్తున్నట్లే. దీనినే ఈశా ఉపనిషద్ ఈ విధంగా చెబుతుంది. "ఈశావాశ్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్". అదేదైనా గాని ఆయనదే గనుక "తేన త్యక్తేన" వ్యామోహం విడిచి సంతోషంగా వుండు. 'క' అను అక్షరం ఎల్లప్పుడూ భగవంతుని సూచిస్తుంది. 'కస్య' అను ఉపనిషద్ వాక్యార్థం ఏమిటంటే "భగవంతునిదని". ఇక్కడున్నదంతా భగవంతుని ఆస్తి కనుక ఏ వ్యక్తిపైనగాని వస్తువుపైనగాని మనకు అధికారము లేదు. బాగుగా ఆలోచించి యిదంతా భగవంతునిదేనన్న ఎరుకగలిగిన ఏ వ్యక్తికైనా వాస్తవానికిది అనుచిత వ్యామోహము కాదు. కానీ మనము

ఏ అధికారమూ లేని, అనవసరమైన, బాధ్యతారాహిత్య మైన బంధనములు కలిగియున్నాము. అశాశ్వత స్వభావముగల వస్తువులను కూడా స్వంతం చేసుకోవాలనే భావన వ్యర్థమని నిరూపిస్తుంది. ''ఇది కూడా గతించిపోయేదే'' అన్న జ్ఞానాన్ని వివేకం మనకు కలిగిస్తుంది. మన స్వంతమనకున్న దేదయినా మనం పొందివున్నదేదైనాకూడా గతించిపోతుంది. వివేకమంటే ఏమిటో ఒక్క వాక్యంలో తెలుసుకోవాలంటే ''ఇది కూడా గతించిపోతుంది'' అని తెలుసుకోవడమే. ప్రతీదీ మార్పుచెందేదే లేక గతించిపోయేదే. కనుక దేనినీ మనం స్వంతం చేసుకోలేమని తెలుసుకొన్ననాడు వైరాగ్యస్థితి సాధ్యపడుతుంది. అన్నిచోట్ల దివ్యత్వం వున్నదన్న ఎరుకగలవానికే వైరాగ్యం సాధ్యపడుతుంది. మనకు దివ్యత్వంయొక్క ఎరుక లేనట్లయితే ''నేను నా కుటుంబాన్ని, పిల్లలను, సోదరీసోదరులను, ఆస్తిపాస్తులను త్యజిస్తున్నానని'' చెప్పడానికి చేసే ప్రయత్నమేదీ మనకు వైరాగ్యాన్ని ప్రసాదించలేదు. మరి భగవంతునిపై నమ్మకమున్న వారు కూడా వైరాగ్యస్థితిలో ఎందుకుండలేక పోతున్నారు? ఎందుకంటే ఆ ప్రత్యేకమైన జ్ఞానం మనకు చాలా తక్కువ. దివ్యత్వం అంతటా వ్యాపించియున్నదన్న మన ఎరుక అతి తక్కువ గనుక దానిని మనమనుభూతి చెందలేక పోతున్నాము. ఆ విషయంగా బుద్ధి కుశలతతో ఎంతోకొంత అవగాహన వున్నదిగాని మన హృదయాలలో ఆ అనుభూతి స్థిరంగా పాతుకొని లేదు.

'ధర్మకర్తృత్వ' (Trustee ship) మనేది మనం పెంపొందించుకోవలసి వుంటుందని కొందరు అభ్యాసీల భావన. ధర్మకర్తృత్వమనేది మనం పెంపొందించుకోవలసినదేమియూ కాదు. మనమీపాటికే 'ధర్మకర్తలం'. దివ్యత్వం మనపై నమ్మకముంచి కొన్ని వస్తువులను, కొందరు వ్యక్తులను మన అధీనంలో వుంచడం జరిగింది. ఆ ఎరుకగలిగి మనం కేవలం ధర్మకర్తలమనే విషయాన్ని తెలుసుకోవాలి. కాని మనం యజమానులమని తలుస్తాము. అట్టి భావన పెంచుకోకూడదు. మనం కేవలం ధర్మకర్తలమే. మన హోదాకూడా అదే. యజమానత్వం అనే భ్రమను విడిచిపెట్టాలి. మనం యజమానులమని భావించిననాడు ఈ పాటికే ఆటలో ఓడిపోయినట్లు. ఎవరైనాగాని యాజమాన్యం అనే భావన వీడలేకపోతున్నాను మరియూ ధర్మకర్తగా వ్యవహరింపలేకున్నానని గాని చెప్పినట్లయితే దానర్థం ఆయనకు భగవంతుని ఉనికిపట్లగాని, సృష్టిపై ఆయనయొక్క అధికారం పట్లగాని సరియైన అవగాహన లేనట్లే. ఈ విషయంలో తత్తరపాటు కూడదు.

మన వివేకము సరియైనదైతే అది వైరాగ్యాన్ననుగ్రహిస్తుంది. ఇది ఆయన ఆస్థి కనుక మనదని చెప్పే అర్హతలేదు.

దివ్యత్వం గురించి నిరంతరమైన ఎరుకలో ఉంటూ మనం వైరాగ్యస్థితిలో స్థిరత్వాన్ని పొందగలం. సంపాదించడం ఒకెత్తైతే దాన్ననుభవించడం మరొక ఎత్తు. డబ్బు సంపాదించే వారంతా దాన్ని అనుభవించలేరు. దానికి ఉదాహరణ పిసినిగొట్లు. వారు పోగుచేస్తారు. విపరీతంగా పోగుచేసి నిలవేస్తారు. కానీ దాన్ననుభవించలేరు. దీని గురించి చాలాస్పష్టమైన అవగాహనవుండాలి. ఒకడు అనుభవించాలనుకుంటాడు. రెండవవాడు కేవలం కూడబెడతాడు. ఇక మూడవవాడు సంపాదించి అనుభవించాలని కోరుకొంటాడు. వీరు రొట్టెను సంపాదించి తినాలనుకొంటారు. అందుకనే

సంపాదించడానికి అంతూపొంతూలేకుండా పోతున్నది. కలిగియుండాలన్న తాపత్రయం ఆక్రమణలకు దారితీస్తుంది. ఎందుకంటే సంపాదించినదాన్ని ఖర్చుచేస్తుంటాడు కనుక అవసరాలకు నిలదొక్కుకోవాలంటే సంపాదన తప్పనిసరి. మనం ఎంతకాలమైతే కూడబెట్టడం, అనుభవించడం, సంపాదించడం అన్న నాటకంలో తగుల్కొని వుంటామో అంతకాలము మనలో వైరాగ్యము పెంపొందే అవకాశంరాదు. కానీ మనకు ప్రాప్తించినదానినే అనుభవించగలిగితే వైరాగ్యము పెంపొందించుకోవడం సాధ్యమే. ఉపనిషద్ చెబుతున్నదదే. "తేన త్య క్తేన భుంజితా" కనుక ఈ బంధాలు, కూడబెట్టాలనే తాపత్రయాలు విడిచిపెట్టికూడా అనుభవించు. మనకు ప్రాప్తించిన దానినే అనుభవిస్తూ సంతోషంగా వుండగలం. భగవంతుడు (Great Father) మనకు దయతో అనుగ్రహించాడు. దానిని గ్రహించడం ఉచితంగా వుంటుంది. ఇది మనది కాదు ఆయనదే. దీనిలో కొంత భాగాన్ని స్వంతంగా కలిగివుండడానికి అనుమతింపబడ్డాము.

తగిన అనుబంధంగురించి మనం ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నాము. అయితే అదేదైనాగాని దైవంతో మనకుగల సంబంధానికి అడ్డురానంతసేపు దానిని మనం తగిన అనుబంధంగా భావించవచ్చు. మనకు దివ్యత్వంతో గల బంధానికి హాని గలగనంతమేరకు తక్కిన బంధాలను అంగీకరించవచ్చు. అయితే అది మనం ధర్మకర్తలుగా జీవితాన్ని గడుపుతున్నప్పుడే సాధ్యపడుతుంది. మన వైఖరి ధర్మకర్తగా కాకుండా మరేవిధంగా వున్నా తగిన అనుబంధాన్ని ఎప్పటికీ కలిగి వుండలేము.

"తగిన అనుబంధము పెంపొందించుకోవడమెలా?" అని ఒక అభ్యాసి అడిగారు. వాస్తవానికది ధర్మకర్తృత్వంనుండే వస్తుంది. మనం ధర్మకర్త స్థానంనుండి బయటకు వచ్చి దేనినయినా సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినట్లయితే అనుచిత వ్యామోహంలో తగులుకొంటాము. ఇది ఇస్లాంమతంలో చెప్పబడిన ముఖ్య మైన పాఠం. ఎప్పుడయితే నీ పుత్రుని ఆహుతిచెయ్యమని భగవంతుడు ఆదేశిస్తాడో ఆ పవిత్ర వ్య క్తి తను కేవలం ధర్మకర్తను మాత్రమేనని నిజమైన యజమాని తన పుత్రుని వెనుకకు అడిగినపుడు తాను తిరిగివ్వవలసి వుంటుందని తెలుసు కనుక ఆహుతికి సిద్ధపడతాడు. ఆ కుమారుడు భగవంతుని కుమారుడనే ఎరుకతోనే తన పుత్రుని తిరిగి యిచ్చేస్తాడు. కాని ఆ పుత్రుడు నావాడేనని తలుస్తాము కనుక మనమా విధంగా చెయ్యలేము. "అవును నేనాహుతి చేస్తా"నని చెప్పడానికి గొప్ప ఋషయ్యుండాలి. ఆ దిశగా మన హిందూ సాంప్రదాయంలో కూడా ఎన్నో ఉదాహరణలున్నాయి. కాని అతి ప్రసిద్ధిచెందిన సత్యహరిశ్చంద్రుడు కూడా తన గతజన్మలో సత్యానికి కట్టుబడిలేడు. భగవంతునిచే అనుగ్రహింపబడిన తన బిడ్డపైగల అమిత వ్యామోహంవలన ఆ బిడ్డను వెనక్కివ్వకుండా తప్పించుకోవాలని చూచాడు.

ఒక బిడ్డననుగ్రహించవలసిందిగా హరిశ్చంద్రుడు కుబేర దేవుణ్ణి ప్రార్థిస్తాడు. పుట్టిన బిడ్డను తనకు తిరిగిచ్చేసే షరతుపై కుబేరుడు బిడ్డననుగ్రహిస్తాడు. అప్పుడాయనకొక బిడ్డ కలుగుతాడు. ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేస్తూ కుబేరుడు బిడ్డను తిరిగి యిచ్చెయ్య వలసిందిగా హరిశ్చంద్రుడిని అడుగుతాడు. బిడ్డను తిరిగివ్వడానికి యిష్టపడని హరిశ్చంద్రుడు వాని బాల్యక్రీడలతో వినోదించనీ, వాడెలా ఆడుకుంటాడో నన్ను తిలకించనీ, వానికి విద్యాబుద్ధులు గరపనీ, వానికుపనయనము చేయించనీ వంటి సాకులతో

సమయాన్ని పొడిగిస్తూ వచ్చాడు. చివరికి భగవంతుడిచ్చిన ఆ బాలుని ఆయనకు తిరిగివ్వడం తప్పకపోవడంతో తాను ఆ బాధ్యతనుండి తప్పించుకోవడానికి పిల్లవానిని ఇల్లు విడచి పారిపొమ్మని సలహానిస్తాడు. ఆ విధంగా భగవంతుని పిల్లవానిని తాను స్వంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆయనను సంతు ఆలీగారితో పోల్చినట్లయితే ఆధ్యాత్మిక జీవిత ప్రయాణంలో ఆలీగారికి ఆయన ఏమూలా సాటి రారు. ఆ కారణంగానే విశ్వామిత్రుడు ఆయనయొక్క నిజాయితీకి పరీక్ష పెట్టారు! పూర్వజన్మలో హరిశ్చంద్రుడు భగవంతునితో అసత్యమాడాడని తెలుసు కనుక వాస్తవంగా ఆయన సత్యానికి కట్టుబడి వుంటాడా అన్న విషయాన్ని ధృవపరచుకోవడానికే విశ్వామిత్రుడు ఆయననెన్నో పరీక్షలకు గురిచెయ్యడం వాటినాయన అధిగమించడం జరిగింది.

మనం దేన్నైనా సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినపుడే వైరాగ్య సాధన కష్టమవుతుంది. ఆయనదేదైతే వున్నదో దానిని వెనక్కిచ్చెయ్యాలి. దీనిని పంచుకోవడం ద్వారానే చెయ్యగలమన్నది మరొక పాఠం. పిల్లవాని తలకు బదులు తలనీలాలర్పించడమనే సాంప్రదాయాన్ని మనం తిరుపతిలో చూస్తాం. బిడ్డను తిరిగి భగవంతునికివ్వడానికి ప్రతీకగా శిరోముండన ప్రక్రియ జరిపిస్తారు. మనం భగవంతునికిలా మనవి చేస్తాం, "నీవు నాకీ బిడ్డనిచ్చావు. నేను మళ్ళీ ఈ బిడ్డను నీకు తిరిగి వెనక్కిచ్చేస్తున్నాను". ఈ భావన పలువిధాలుగా మారింది. అది వేరే ముచ్చట. మనం వారినింకా స్వంతం చేసుకోవాలనుకోవడం నిజం. కాని అసలు సమాచారమది కాదు. ఆ బిడ్డను మనకు భగవంతుడిచ్చిన కానుకగా తెలుసుకోవటమే అసలు సమాచారం. ఒక సారి ఆ బిడ్డ భగవంతుని కానుకగా మన సంరక్షణలో వుంచబడినప్పుడు ఆ బిడ్డ మనకేవిధంగా స్వంతమవుతుంది. ఆస్తి విషయంలో కూడా అంతే। ఆ మాటకొస్తే ఇక్కడ మనదంటూ ఏమీలేదు.

హృదయ స్పందనల మధ్య నిశ్శబ్దం వున్నదన్న విషయం తెలుసుకోనంత కాలం ఈ స్థితి ఆవిష్కరింపబడదు. ఏ కొద్దిమందో దానిపై ధ్యానిస్తారు. గుండెకొట్టుకొనే చోట ధ్యానించమంటాము. ఎందుకని? చలనాచలనముల మధ్య ఒక విరామం వుంటుంది. ఒక సమతౌల్యస్థితి ఆవిష్కరింపబడి వుంటుంది. అక్కడవుండే సహజ సమతౌల్యస్థితి మనము సర్వదా కాంక్షించే శాంతిని అనుగ్రహిస్తుంది. అది తాత్కాలికమే అని తెలిసినా కూడా శాశ్వతంగా వుండాలని అభిలషిస్తాము. హృదయస్పందనలపై మనలనెందుకు ధ్యానించ మంటారో కాస్త బాగుగా ఆలోచించినట్లయితే ఆ రెండింటి మధ్య విరామం వుంటుందని ఆ విరామం మనకు శాంతిని గుర్తుచేస్తుందని. మనం కేవలం శాంతి స్వరూపులమే. ఆ సమతౌల్యమే మన స్వభావము. అది మన గుర్తింపు. జీవితములో మనం చేసే ప్రతి పనీ కూడా క్రియాశీలత్వము లేక క్రియారాహిత్యస్థితిగా పేర్కొనబడు తుంది. కాని ఈ రెండింటిలో ఏదీ కూడా నిజం కాదు. ఆ శాంతినిగాని తెలుసుకున్నట్లయితే పరిత్యజించడం సులువే. దానిని తెలుసుకోలేక పోయినట్లయితే పరిత్యజించడం మనకంత సులభం కాదు. ఈ ప్రపంచంలో మనము కలిగివున్నదంతా చైతన్యమో లేక జడత్వమో అంతే గాని సమతౌల్యమును ఎవరూ సొంతంగా కలిగివుండలేదు. సమతౌల్యము ఆశలతో వేధించేదే గాని తృప్తి పరచని స్థితి. శాంతి మన స్వభావము. అదే భగవంతుని స్వభావమని తెలుసుకున్నవాడు సాధారణంగా మనం ఎవనికీ లేక దేనికీ అంటిపెట్టుకొని వుండము.

వైరాగ్యాన్ని మనం వేరే కోణంలో చూచినట్టయితే, అదే సాంఘిక దృక్పథంతో చూచినట్టయితే ఎవరైనాగాని 'వీటిని నేను విడిచి యుండలేకపోతున్నానని' చెబితే ఆ విషయంపై అమితాసక్తి చూపుతున్నట్టు లెక్క. మనకు తెలుసు ఆ ఆసక్తి తాత్కాలికమేనని. పూర్వీకుల ఆస్థి అయిన కొంత భూమిని గాని ఉదాహరణగా తీసుకున్నట్లయితే, దానిని మన ముత్తాత సాగుచేశారు, తాత సాగు చేశారు, మన తండ్రి సాగుచేశారు, ఇప్పుడు మనం సాగు చేస్తున్నాము, మన కొడుకులు కూడా సాగుచేస్తారు. అయితే ఈ భూమి ఎవరిదన్నట్లు. ఇది కుటుంబ ఆస్తి అనే భావానికి వస్తాము. అయితే ఆ భూమియొక్క స్వంతదారు కుటుంబం కాదు. భగవంతుడే స్వంతదారు. అయితే ఎంత కాలమయితే ఆ కుటుంబంలోని వారు నీతి నిజాయితీలతో వుంటారో అంతకాలం ఆ ఆస్తి వారి వద్దే వుంటుంది. లేని పక్షంలో వీరికంటే నమ్మకస్తులయిన వేరొకరి చేతుల్లోకి వెళ్ళిపోతుంది. మన ఆధీనంలోవున్న కొన్నింటిని మనవిగా భావించడం జరుగుతుంది. ఈ మేజాబల్ల (Table)ను శుభ్రంగా వుంచే పని నాకివ్వబడింది. కనుక ఇది నాదనుకుంటాను. మా కార్యాలయంలో ఒక తమాషా చూచేవాడిని. ఆ Tableను ఎందుకు శుభ్రం చెయ్యలేదయ్యా అనడిగితే మా బంట్రోతులు (attenders) చెప్పేవారు 'ఈ బల్ల నాది, ఆ బల్ల వేరేవాడిదని, వాడు రాలేదు కనుక దానితో నాకు పనిలేదు, నా బల్లనే శుభ్రం చేస్తాను, ఆ బల్లను శుభ్రం చెయ్యనని'. కాని అటువంటి ఆలోచన మనకు బొత్తిగా వుండకూడదు. అయినా దానినే మనం పెంపొందించుకుంటాము. గుమాస్తాల విషయంలోను ఇదే కనబడేది. ఫైల్స్ విషయంలో కూడ ఇదే చూచే వాడిని. "ఈ ఫైల్ నాది సార్ వేరొకడికివ్వను" అనే వారు. ఎవరు చెప్పారయ్యా అనడిగితే అతనొక ఆఫీస్ ఆర్డరు చూపెంచేవాడు. దానిలో ఈ అంశం ఇతనికి సంబంధించినది, ఇంకొకటి వేరొకరికి సంబంధించినదని వుంది. ఈ తాత్కాలికమైన ఏర్పాటుకతడు శాశ్వతత్వాన్ని ఆపాదించుకున్నాడు. మనం ధర్మకర్తలుగా వ్యవహరించడం కూడా తాత్కాలికమే. ఇక్కడి మన యునికి కూడా క్షణికమే. మహా అయితే మనం ఎనభై, వంద లేక నూట ఇరవై సంవత్సరాలు బ్రతకవచ్చు కాని శాశ్వతంగా మాత్రం కాదని ఖచ్చితంగా చెప్పవచ్చు. మనం ధర్మకర్తలుగా వ్యవహరించే సమయంలోనే బాధ్యతలు వహిస్తాము, అయినాగాని మనమా పరిధిలో వ్యవహారాలు నిర్వహిస్తాము కనుక అది మనదేనన్న భావంతో వుంటాము. ఎంతకాలమైతే మన గురుదేవుల కార్యం మనం నిర్వహిస్తున్నామన్న భావనలో వుంటామో అంతకాలం ఏ సమస్యా వుండదు. మనకై మనమే ఏదో నిర్వహిస్తున్నామన్న భావనలో వున్నంత కాలం సమస్య వుంటుంది. కనుక ఇక్కడ మనము మాట్లాడుకొనే వైరాగ్య భావన అతి క్లిష్టమయినది. దాన్నర్థం చేసుకోవడానికి గురుదేవుల గ్రంథముల సహాయముతో వివేకముగురించి కూడ అవగాహన తప్పనిసరి. ఈ సందర్భంలో ఒక అభ్యాసి తనయొక్క ఆహారపుటలవాట్ల గురించి పేర్కొన్నారు. అది వివేకానికి సంబంధించినది గాని వైరాగ్యానికి సంబంధించినది కాదు. విచక్షణా రహితంగా భుజించడమనే అంశానికి సంబంధించి వైరాగ్యం చెయ్యగలిగిందేమీ లేదు. జిహ్వా చాపల్యం వుండాలా, వుండకూడదా అన్న విషయం వివేకానికి సంబంధించిన అంశం. కాని వైరాగ్యానికేమాత్రం సంబంధం లేదు.

కాని ఈ రెండంశములు నొకదానినొకటి అతిక్రమిస్తూనే వుంటాయి. కనుక మనం వైరాగ్యం కలిగి వుండాలా, వివేకం కలిగివుండాలా అని అర్థం చేసుకోవడం ఎప్పుడూ, కష్టంగానే వుంటుంది. అందుకే దానిని 'జ్ఞాన వైరాగ్యం'గా వ్యవహరిస్తారు. అందువలననే వీటికి సంబంధించి మన పద్ధతిలో 1, 1ఎ అను

బిందువులు అతి సన్నిహితంగా వుండి ఈ ఆధ్యాత్మిక స్థితులయొక్క పరస్పర సంబంధ స్వభావాన్ని సూచిస్తాయి.

దివ్యత్వం అన్నిచోట్ల వున్నదన్న ఎరుక లేనిచో మనకు ఏనాటికీ సహజమైన వైరాగ్యం కలగదు. మనం ధ్యానం ద్వారా ఈ ఎరుకను పొందడానికి ప్రయత్నిస్తాము. మళ్ళీ మళ్ళీ మనమెందుకు హృదయంపై ధ్యానిస్తామంటే ముఖ్యంగా ఆ స్థానంలో దివ్యత్వం యొక్క స్వభావాన్ని, భగవంతుణ్ణి లేక సమత్వమనే సత్‌తత్వస్థితిని మనం తెలుసుకోగలం. అక్కడగల సమత్వం అక్కడ మనం పొందే శాంతి వైరాగ్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. దానికి స్థిరసంకల్పంతో తప్ప తక్కిన విషయాలతో సంబంధం వుండదు. కొంతమంది అభ్యాసులు వైరాగ్యంయొక్క ఇతర అంశాలకు సంబంధించి అవి స్థిరసంకల్పానికి సంబంధించిన అంశాలని చెబుతారు. వివేకమనేది జీవితంలోని ఒక దశకు మరొక దశకు భిన్నంగా వుంటుంది. బ్రహ్మచారియొక్క వివేకము గృహస్థునియొక్క వివేకానికి భిన్నంగా వుంటుంది. అది మళ్ళీ సన్యాసికీ వానప్రస్థునకూ భిన్నంగా వుంటుంది. ఎప్పుడూ వివేకం ఒకేలా వుండదు. అలాగే వైరాగ్యం కూడా. మనం "ఈ ప్రపంచాన్ని త్యజిస్తున్నామని" చెప్పడానికి ప్రయత్నించినపుడు, మనం చెయ్యలేని దానిగురించి మాట్లాడుతున్నామన్న మాట. ప్రపంచంలో వుంటూ ప్రపంచాన్ని త్యజించడమనేది అసంభవం. ఈ ప్రపంచములోని కొన్ని సంబంధాలను వదులుకోవచ్చు. మన భాగస్వాములతోగల సంబంధాన్ని వదులుకోవచ్చు. పిల్లలతో గల సంబంధాలను, తల్లిదండ్రులతోగల సంబంధాలను లేక ఇంటితో గల సంబంధం మొదలగు వాటిని త్యజించవచ్చు గాని ప్రపంచాన్ని మాత్రం ఎన్నటికీ త్యజించలేము. నా వుద్దేశ్యంలో ప్రపంచాన్ని త్యజించడమనే పదం మూర్ఖత్వమే. ఎందుకంటే మనం చనిపోయాక గాని ప్రపంచాన్ని త్యజించలేము. ఎవడూకూడా ప్రపంచాన్ని త్యజించలేడు. అటువంటి అవకాశం లేదు. నేనంటున్నట్లు భగవంతునియొక్క పరిధి చాలా పెద్దది. కనుక దానినుండి మనం పారిపోలేము. మనమెల్లపుడు ఆ పరిధిలోనే యుంటాము. మనము ఆ పరిధిలోనే తిరగాలి తప్ప యింకేమీ చెయ్యలేము. ఆ పరిధి దాటి మన ఉనికిలేదు. ఎప్పుడైతే మనకు శాశ్వతత్వాన్ని ఆపాదించుకుంటామో మనం కలిగివున్న సంబంధాలకు కూడా శాశ్వతత్వాన్ని ప్రసాదిస్తాము. మనం శాశ్వతం కాదని చెప్పుకున్నట్లయితే మనకున్న ఏ బంధం కూడా శాశ్వతం కాదు.

మనం శాశ్వతం కాదన్న ఎరుక ఎందుకు కష్టాలలో పడవలసి వచ్చింది. అరవైనాలుగు సంవత్సరముల క్రితం నేను అదే బిడ్డను కానని నాకు తెలుసు. ఒక చిన్న బిడ్డనని, కానీ మార్పు చెందుతున్నానని నాకు తెలుసు. అయితే నేనెప్పటికీ జీవించి వుంటాననే ఈ మూర్ఖపు భావన ఏమిటి? ఎక్కడనుండి ఈ భ్రమ పుట్టింది? ఈ భ్రమను ఎవరు కల్పించారు? శాశ్వతంగా వుండే మన చైతన్యమే మనకా భ్రమను కల్పించింది. అందువలనే చైతన్యము శాశ్వతమని పేర్కొంటారు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములనే అత్మయొక్క నాలుగంగములలోను చిత్తమనేది శాశ్వతంగా వుంటుంది. అది ఎప్పుడూ పసిదానిగానే వుంటుంది గాని ముసలిదవదు. మన ఆలోచనా సరళి పరిపక్వత చెందుతుంది గాని మన చైతన్యము మాత్రము పరిపక్వత చెందదు. అది అప్పుడు, ఇప్పుడూ, ఎప్పుడూ ఒకేలా వుంటుంది. మన భావాలు పరిపక్వత చెందుతాయి. మనస్సు పరిపక్వత చెందుతుంది. బుద్ధి పరిపక్వత చెందగలదు. కానీ చైతన్యం విషయానికొస్తే అలా జరగదు. ఆ కారణంగానే మనం ఎల్లప్పుడూ యవ్వనవంతులుగానే

అనుభూతి చెందుతాము. దానికి కారణం మనం శుద్ధ ఆత్మలమని మన చైతన్యం చెప్పడమే. మన జీవతత్వంయొక్క మూడు అంగములైన బుద్ధి, అహంకారము, మనస్సులనే వాటివలనే ఆ మార్పు. అందువలనే మనం శాశ్వతత్వమును అనుభూతిచెందడమనేది నిజం. ఈ శరీరంలో వున్నాగాని, ఈ శరీరం బయటవున్నాగాని మనం అమరులం. చిత్తమెప్పుడూ వుంది. ఎల్లప్పుడూ వుంటుంది. ఆ చైతన్యమునే నేను సనాతన లేక శ్రీ రామచంద్ర చైతన్యమని పిలుస్తాను. ఆ చైతన్యము మనలోని చైతన్యము ఒక్కటే. భేదమేమీ లేదు. ఆ కారణంగానే మనము ఆయనలోనికి ప్రవేశించగలుగుతున్నాము. ఆయన కూడా మనలోనికి ప్రవేశించగలుగుతున్నారు. అలాగే నిష్క్రమించగలుగుతున్నారు. లోపలికి ప్రవేశించడానికి గాని లేదా తిరిగి రావడానికి గాని సర్వసాధారణమైనదేదో మనకొకటి వుండాలి. శాశ్వత స్వభావముగల ఆ చిత్తమే నిజమైన ఆత్మ. అదే మనం శాశ్వతతత్వాన్ని అనుభూతిచెందేలా చేస్తుంది. అసలు విషయమేమిటంటే గులాబీల పరిమళం వాటితో మాల కట్టబడిన దారానికి అంటినట్లు తక్కిన మూడు అంగాలకు శాశ్వతత్వాన్ని ఆపాదిస్తాము. కానీ అది తాత్కాలికము. శుద్ధమైన నిరాడంబరమైన చిత్తమెల్లప్పుడూ వుంటుంది. కనుక మన వయస్సెంతైనా కూడ వృద్ధాప్యభావన కలుగదు. శరీరం మాత్రం ముసలిదైపోతుంది. మన శరీరం ముసలిదైపోతున్నదని మనకు తెలుసు. కానీ మనం ముసలి వాళ్ళమని ఎన్నడూ భావించం. ఎవడూ ఆ విధంగా తలవడు. ఆఖరికి చావబోయే వాడుకూడ ఆవిధంగా తలవడు. వాని ఆలోచనలు ముసలివి కావచ్చు, అనుభూతులు ముసలివి కావచ్చు కానీ అతడు మాత్రం ముసలివాడు కాడు. చిత్తము యొక్క స్వభావము కారణంగా మనం కొంత శాశ్వతత్వాన్ని మంజూరు చేసుకొంటాము. మనం శాశ్వతత్వం మంజూరు చేసుకొన్నాం గనుక మన శరీరంవలె మార్పుకు లోనయ్యే ఆ మూడు భాగాలకు కూడ శాశ్వతత్వం మంజూరు చేయజూస్తాం.

ముందు పేర్కొన్న జీవతత్వం (ఆత్మ) యొక్క శాశ్వతత్వం మంజూరు చేసిన ఆ మూడు అంగాలను అంతఃకరణ అని పిలువవచ్చు. అదేవిధంగా ఇంద్రియాలు కూడా అంతఃకరణ అనే పదంలో చేర్చబడ్డాయి. మనం మరణించిన ఉత్తర క్షణంలో ఇంద్రియాలు తిరిగి మట్టిలో కలసిపోతాయి. దేహంయొక్క క్షణభంగురత్వం గురించి మాట్లాడే వారు ఆత్మయొక్క శాశ్వతత్వాన్ని నొక్కిచెబుతారు. కానీ సాధకులను తెలుసుకోమని కోరేదేమిటంటే బుద్ధి, మనసు, అహంకారమనే ఈ మూడింటిలోకూడా క్షణిక స్వభావాన్ని కనుగొనగలం. మనం మన అహంకారాన్ని తగ్గించుకోగలం. మన అనుభూతులను రూపాంతరం చెందించగలం. కానీ వాటివెనుకగల చైతన్యాన్ని మార్చలేము. మనం విషయాలను తారుమారుచేస్తూ కలవరపాటుతో చైతన్యంతో సంబంధంగల ప్రతిదానికి దేహంతో సహా శాశ్వతత్వాన్ని మంజూరు చేస్తాం. అయితే చైతన్యపరంగా చూస్తే అది ఏమార్పుకూ లోను కాదు.

మన ప్రథమ అవగాహన ఏమిటంటే ఈ శరీరం అశాశ్వతమని చాలా బాధతో అర్థం చేసుకొంటాం. తక్కిన ఆ మూడు అంశాల గురించి వాటి క్షణికత్వ స్వభావాన్ని మరణసమయంలో కూడా అర్థం చేసుకోలేకపోవడమే మన పునర్జన్మకు కారణం. ఒక జన్మనుండి మరొకజన్మకు మన అంతఃకరణ, మనస్సు, అహంకారం, అనుభూతులు ప్రయాణం సాగిస్తాయి. ఈ మూడు అంశాలకూ సంబంధించి మనం విడిచివుండడాన్ని ప్రత్యేకించి పెంపొందించు కోనట్లయితే యదార్థానికి మనం నిజమైన వైరాగ్యాన్ని పెంపొందించు కోలేము. ఈ అంశముల క్షణికత్వముయొక్క ఎరుకలో వుండడమనే అతి క్లిష్టమైన పాఠాన్ని వైరాగ్యసాధనలో

నేర్చుకోవలసిన అవసరం వున్నది.

మనం ఒక వస్తువుపై గాని, వ్యక్తిపై గాని వ్యామోహ భావన కలిగివున్నప్పుడు కొన్ని తప్పనిసరి పరిస్థితులలో అనగా ఆ వ్యక్తి మరణించడంగాని లేక మననుండి వేరుచేయబడిన భావన ఏర్పడినప్పుడు బలవంతంగా ఆ భావనను మార్చుకొనవలసివస్తే ఆ మార్పునంగీకరించడానికి యిష్టపడక మానసిక సంఘర్షణకు లోనవుతాము. మనమా ప్రత్యేకమైన వ్యక్తిపైగాని, వస్తువుపై గాని గల భావానికి కొంతమేర శాశ్వతత్వాన్ని మంజూరు చేసుకొన్నాము. ఈ రోజది లేకుండా పోయిందికనుక మన మూలం కదిలింపబడింది. తమ కుమార్తెలను ఎవరికో యిచ్చి వివాహం జరిపించిన వారి విషయంలో వేరుచేయబడ్డ అనుభూతి కలుగుతుంది. ఆ వ్యక్తి వీరినుండి వేరు పడాలని తెలుసు. వారివద్ద వుండరనీ తెలుసు. కానీ ఆ వేరుపడడమనే భావాన్ని వారంగీకరించడానికి సిద్ధంగా వుండరు. ఎందుకంటే పరిస్థితులలోని మార్పును వారంగీకరించడానికి సిద్ధపడరు. వారు ఆ తండ్రీకూతురు బంధమనే అనుభూతికి శాశ్వతత్వాన్ని మంజూరు చేశారు కనుక. ఆమెకు వివాహమైన క్షణం నుండి తండ్రీ కూతుళ్ళ బంధం ముగుస్తుందని మన సాంప్రదాయం చెబుతున్నది. కానీ అలా జరగడం లేదు. గతంలో కూడా అలా జరగలేదు. బహుశా భవిష్యత్తులో కూడా అలా జరగకపోవచ్చు. మనం ఏదో ఒక ఊరిలో పుడతాం. ఆ ఊరినుండి వెళ్ళిపోయినాగాని ఆ ఊరిపై మమకారం ఉంటుంది. అనుభూతి వుంటుంది. దానితోగల అనుబంధం శాశ్వతమైనట్లు తెగిన ఆ బంధాన్ని నిలుపుకోవాలని కోరుకొంటాం. మన దైనందిన వ్యవహారాల్లో ఎన్నో అర్థం లేని పదాలను వాడుతాం. 'నీ జన్మస్థలమేది' సంఘం మనమీద వత్తిడితెచ్చే భావన. ఆ భావన మనమొక్కరమే కలిగివుండడం కాదు. మన తల్లిదండ్రులు దానికి వత్తాసు పలుకుతారు. సంఘం తన ఆమోదాన్ని తెలుపుతుంది. కానీ ఒకసారి దానినుండి విడదీయబడినప్పుడు మనం ప్రశ్నించడం ప్రారంభిస్తాము. చాలా యిబ్బంది పడతాము. దానికి లేని శాశ్వతత్వాన్ని మనం మంజూరు చేశాము. కనుక ఆ నష్టానికి మనం బాధపడతాము. మొదట్లోనే ఈ బంధాన్ని త్యజించగలిగిన నాడు, అది కేవలం తాత్కాలికమేనని తెలుసుకొన్న నాడు, మనం ఈ సమస్యనుండి బయటపడతాం. మనము ఒక చొక్కా కొన్నాము. అది మనదే. అది మనదేనన్న భావన కలిగి వుంటాము. దానిని చాకలికి వేశాము. అతడు దానిని కాలబెట్టాడు. అది ఎప్పుడైనా కాలవచ్చు లేక కొంతకాలానికి చినిగిపోతుందన్న విషయం మనకు తెలిసినాకూడా దానినుండి వేరుచేయబడడాన్ని అంగీకరించలేము. ఎందుకంటే మనం చొక్కాకు కొంత హేతుబద్ధమైన శాశ్వతత్వాన్ని మంజూరు చేశాము. కానీ అది నిజం కానక్కరలేదు. మనం శాశ్వతత్వాన్ని మంజూరు చేస్తున్నప్పుడు వైరాగ్యాన్ని పెంపొందించుకోవడమనే సమస్యను పరిష్కరించుకోవడం కష్టం. ఎప్పుడైతే మనం ప్రతీదీ అశాశ్వతమని, అన్ని సంబంధాలు కూడా తాత్కాలికమేనన్న ఎరుక కలిగివుంటామో అప్పుడీ సమస్యే వుండదు.

అతి క్లిష్టమైన మరొక అంశం మన భావాలు. ఎందుకంటే అది బుద్ధికి సంబంధించినది. కొంతమంది దేవతలకు సంబంధించిన కొన్ని స్థలాలకు ఊహలకు కట్టుబడి వుంటారు. ముక్తికోసం సందర్శించడానికి మనకు 'కాశీ', మహ్మదీయులకు 'మక్కా', కొందరికి 'జెరూసలెం' ప్రదేశాలున్నాయి. ఈ విధంగా మనం కొన్ని ప్రదేశాలకు, కొన్ని వస్తువులకు అంటిపెట్టుకొని వుంటాము. మక్కా వెళ్ళడం వలన మోక్షం వస్తుందని చెప్పబడినప్పుడు, మనకు మోక్షమొసగేది 'కాశి' యే నని మనకు తెలుసు కనుక మనము మక్కాను

అంగీకరింపము. ఎందుకంటే మనకు కాశీతోగల బంధం మార్పు చేయబడనిదన్నట్టు దానికి శాశ్వతత్వాన్ని మంజూరు చెయ్యడమే. ముఖ్యంగా యీ సమస్య విజ్ఞానమయ కోశంలో ఉత్పన్నమవుతుంది. ఉదాహరణకు మన సత్‌తత్వాన్ని తెలుసుకోవడానికి (for realisation) పూజ్య బాబూజీ గారిచ్చిన పద్ధతి ఒక్కటే మార్గమని మనమెంతగానో వాదించవచ్చు. అలా యెందుకంటే మనకు దానితోగల అనుబంధమే కారణం. కాని మనకు తెలియనివెన్నో పద్ధతులుండవచ్చు. ఎప్పుడయితే ఈ ఎరుక పెంపొందుతుందో అప్పుడు మనం మోక్షానుభూతిని పొందుతాము. మనం నిష్కపటంగా వున్నపుడు మోక్షం పొందుతాము. మనం మన ఎత్తుగడలకు, భావాలకు, మీదుమిక్కిలి మన అహంకారానికి సన్నిహితంగా అంటిపెట్టుకొని వుంటాము. నిన్న చక్కగా వ్రాశాను కనుక ఈ రోజు కూడా చక్కగా వ్రాస్తాననే భావన నిజం కానవసరం లేదు. అదే కవి వివిధ రచనలనందించాడు. అయితే అవన్నీ ఒకే విధంగా అందంగా లేక ఇంపుగా వుండనవసరం లేదు. ఆయనెంత గొప్ప కవి అయినాగాని ఆయన స్థానమదే. కాని ఆయన రచనలన్నింటికి మనం ఎంతోకొంత గొప్పతనము ఆపాదింపచూస్తాము. షేక్స్పియర్ చాలాగొప్పగా వ్రాసాడని ఎవరైన అన్నారనుకోండి, దానికంగీకరింపని మనం షేక్స్పియర్ కొంత చెత్తకూడా వ్రాసినట్లున్నాడన్నపుడు, ఆ కారణంగా ఎదుటి వ్యక్తి మనతో పోట్లాటకొస్తాడు. ఆ వ్యక్తియొక్క సామర్థ్యానికి అతడు కొంతమేర శాశ్వతత్వాన్ని ఆపాదించాడు కనుక నీతో ముష్టియుద్ధానికి కూడా సిద్ధపడతాడు. అతడు పొరపడ్డాడన్న దానిని కూడా అంగీకరించడానికి యిష్టపడడు. మన అహంకారంవల్ల కలిగిన ఇబ్బంది వలన మన పొరపాటును మనమంగీకరింపము. నిన్న నేను గుర్తింపబడ్డాను. ఈ రోజు గుర్తింపబడలేదని మన అహంకారం చెబుతుంది. నిన్నటి చక్కటి ఆటగాడు ఈ రోజు నైపుణ్యతాలోపం వలన జట్టునుండి తొలగించబడ్డాడని చెప్పినా దానినంగీకరించడానికి ఆయన సిద్ధంగా యుండడు. నిన్నొకాయన బ్రహ్మాండమైన చిత్రకారుడు, ఈరోజాయన చిత్రాలు చెత్తగా వున్నాయంటే వొప్పుకోడు. తానందించినవి పనికిమాలినవనే దాన్నంగీకరించకుండా తన పనితనంగురించి వాదించేవాడు పెడసరి. తన అపజయాన్ని అంగీకరించడానికి ఒప్పుకోడు. అతడు చాలా బాగా చేస్తాడని మనమొకనికి కొంత సామర్థ్యాన్ని ఆపాదించినపుడు తనెప్పుడూ బాగానే చేస్తాననే ఊహకది దోహదపడుతుంది. అహంకారానికి వచ్చే ముఖ్యమైన సమస్యే ఈ సమస్య. దాన్ని మనం నిరోధించిననాడు స్వాభావికంగా మన అహంకారం సమత్వస్థితికి వస్తుంది.

ఏ రంగంలోనయినా సరే నేను పొరపాటు చేయనని నాకు చెప్పారు కనుక నేను పొరపాటు చెయ్యలేనని భావించే మనస్తత్వమే ముఖ్యమయిన సమస్య. కనుక మనం పరిత్యాగం గురించి మాట్లాడటమంటే వాస్తవానికి కొరకరాని కొయ్యలైన మానసిక ఊహలను, అనుభూతులను మరియు మన అహంకారములను త్యజించడమే. తక్కిన వాటిని చాల సులువుగా వదిలేయవచ్చు. చాలామంది తమ ఇళ్ళను, భార్యాబిడ్డలను విడిచి బయటకు వెళ్ళారు గాని ఈ మూడింటిని త్యజించలేక పోయారు. వారు వెళ్ళినా కూడ వారియొక్క స్థానాలను మాత్రం మరచిపోలేకుండా వున్నారని పూజ్య బాబూజీ గారు చెప్పారు. దానికి కారణం పై మూడు వారితో కూడ వుండటమే. మొదటి విషయమేమిటంటే అటువంటి పరిత్యాగం సాధ్యపడదు. రెండవ విషయమేమిటంటే ఒకవేళ మనం వేరొక చోటికి వెళ్ళిపోతున్నామని చెప్పినాకూడా అది పరిత్యజించడం కాదు. బాధ్యతలను అప్పగించడం ఒక కుటుంబ వ్యవస్థలోనే సాధ్యపడుతుంది కనుక

పరిత్యజించడమనేది ఒక గృహస్థునకే సాధ్యం. మన బాధ్యతలను మనం అప్పగించవచ్చు. నాకొక పని వున్నదనుకోండి. దానిని నా తమ్ముడు చేస్తాడని చెప్పవచ్చు. నా సోదరి చేస్తుందని చెప్పవచ్చు. నా భార్య చేస్తుందని చెప్పవచ్చు. నా పిల్లలు చేస్తారని చెప్పవచ్చు. అదే సమయంలో నేను దానితో సంబంధం లేకుండ వుండొచ్చు. కాని అటువంటప్పగింతలకు మనం సిద్ధంగా లేము. పదవీ విరమణ తరువాత కూడా మనం బాధ్యతలనుండి విడుదల పొందాలని చూడం. మరణశయ్య పై వున్నాకూడ ఇంటి తాళాలను వదలడానికి సిద్ధంగా వుండము. నీకిష్టం వున్నా లేకున్నా నీ మరణానంతరం ఈ తాళాలు తరువాతి తరం వారికి చెందవలసినవే. అయినా అప్పజెప్పడం లాంటివి మనం చెయ్యము. సన్యాసికి అప్పజెప్పడానికి ఏమీవుండదు. గృహస్థాశ్రమంలోనే వొప్పగింతలు సాధ్యం. మన బాధ్యతలను అప్పగించవచ్చు. మనకు పూట గడవనప్పుడే ఎదుటివాడినేదైనా చెయ్యమనడగవచ్చు. వారి సహాయాన్ని అర్థించడం ద్వారా మన అహాన్ని అదుపులో వుంచుకోవచ్చు. మన కుటుంబంలో ఎవరోఒకరు మనకు సహాయం చేస్తున్నారని తెలుసుకున్ననాడు ఈ కుటుంబాన్ని నేనే పోషిస్తున్నానన్న భావంకూడ పోతుంది. అది ఒక్క గృహస్థజీవితంలోనే సాధ్యం. మనమాలోచించినట్లయితే ఆధ్యాత్మికపరంగా గృహస్థజీవితంలో ఎన్నో అనుకూలమైన పరిస్థితులున్నాయి. కాని మన భావాలను, అస్పష్టమైన ఊహలను పట్టుకొని వేలాడుతున్నంతకాలం మనం గృహస్థజీవితంలో ఏమీ నేర్చుకోకుండా తెలివిహీనులుగానే మిగిలి పోతాము.

నేను చేసే ఎడతెగని స్థిరమైన ధ్యానంవలన నాకు యిది సాధ్యమనే అభిప్రాయం ఏర్పడింది. నేను గుండె కొట్టుకొనేచోట ధ్యానిస్తున్నపుడు అక్కడ సమత్వమున్నదన్న భావన నాకెల్లప్పుడూ కలుగుతుంది. అక్కడెల్లప్పుడు కొంత చలనము, కొంత జడత్వము వుంటుంది. అక్కడ కొంత చురుకుదనము కొంత మందకొడి తనము వుంటుందని నాకు తెలుసు. 'జరగనివ్వు' అనేదానికి నేను కట్టుబడి వున్నాను. గృహస్థులుగా 'జరగనివ్వు' అనే సిద్ధాంతాన్ని నేర్చుకోగలం. మనమవలంబించగల, పొందగల నిజమైన వైరాగ్యమదే. వాస్తవంగా వైరాగ్యమొక్క గృహస్థునకే సాధ్యం. నా దృష్టిలో సన్యాసులు విరాగులు కారు. వారు వారిపట్ల, వారి ఆధ్యాత్మిక పురోగతి పట్ల, వారిపై ఆధారపడ్డవారి పట్ల, వారికి గల బాధ్యతలను త్యజించినవారు.

'తేలికగా ప్రయాణించు' అని పూజ్య బాబూజీ గారు చెప్పినట్లు దైవ నిర్ణయం ప్రకారం ధర్మకర్తగా జీవిస్తూ దివ్యత్వాన్ని తనద్వారా ప్రకటింపజేస్తూ ఏ బరువూ బాధ్యతలు లేకుండా తన మూలమునకు తిరిగి వెళ్ళగల స్థితిలో వున్నవాడే గృహస్థంటే. తేలికగా ప్రయాణించ గలగడం ఒక్క గృహస్థునికే సాధ్యం. మన బరువు బాధ్యతలను వేరొకరికి అప్పజెప్పగలం. 'తేలికగా ప్రయాణించు' అన్న వ్యాసంలో గురుదేవులు రైలు ప్రయాణీకులు తమయొక్క వస్తువులను గార్డుయొక్క అధీనంలో వుంచి తాము ఏ బరువూ లేకుండా తేలికగా ప్రయాణించడమనే అందమైన ఉదాహరణ యిచ్చారు. దీనిని మనలో ఎందరు బాధ్యతలను అప్పగించడంగా భావించామో నాకు తెలియదు గాని నేనలాగే భావిస్తాను. సామాన్లు మోసుకొనే బాధ్యత నాకు లేదు. వాటినెవరో వొకరు మోస్తారు. వారు నాకొడుకో, భార్యో, కోడలో, కూతురో, అల్లుడో వారెవరైనా అదంత ముఖ్యమైన విషయం కాదు. ఎవరో వొకరికి బాధ్యతలనప్పజెప్పాలి. ఆ వ్యాసంలో పూజ్య బాబూజీ గారు గురువు/దైవం గురించి మాట్లాడారు. 'తేలికగా ప్రయాణించు' అనే పూజ్య బాబూజీ గారి

వ్యాసాన్ని తీసుకున్నట్టయితే అదే వైరాగ్యంయొక్క అంతిమ ఫలితం. వైరాగ్యముయొక్క అంతిమ ఫలితముగా మనము ఏ బరువు బాధ్యతలు లేకుండా పయనించగలస్థితిలో వుండాలి. ఎవరినోవొకరిని పూర్తిగా నమ్మగలిగినప్పుడే అది సాధ్యపడుతుంది. మనమా వ్యక్తికి ధర్మకర్తలమేగాకుండా మనమా వ్యక్తిని నమ్మాలి. అటువంటి నమ్మకం వివేకంవలనే సాధ్యపడుతుంది. మనము నిత్యమూ అనుభవించే ఆ దివ్యత్వపు ప్రవాహంవలన, ఆ దివ్యత్వపు సాన్నిహిత్యమువలన, ఆయనున్నాడనే అవగాహనతో మన సర్వస్వము ఆయన ఆధీనంలో వుంచగలం. అప్పుడది పరిత్యాగపు సమస్యకాదు. అది ఎవరికి చెందినదో వారికి తిరిగి అందజేయడమనే సమస్య. అది ఆయనది. ఈ ప్రపంచం ఆయనది, ఇక్కడి సర్వస్వం ఆయనదే, తిరిగి ఆయనకే అందజేశాము. మన అంతస్తుకు తగ్గట్టుగా దానిని తీసుకొని వచ్చి ధర్మకర్త యెలా సంపదను దుర్వ్యయం చెయ్యడో, అలా దుర్వ్యయం చెయ్యకుండా, దాన్నేవిధంగా కాపాడాలో ఆ విధంగా కాపాడి తిరిగి ఆయనకు అప్పగించాం. ఒక వ్యక్తి ధర్మకర్తగా వ్యవహరించేటట్లయితే ఆయన తన బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తిస్తూ, సంపదను దుర్వ్యయం చెయ్యడు. కనుక ఆ భావంతో వైరాగ్యమంటే మనం పెంపొందించేదేకాని, క్రియాశూన్యత్వమూ కాదు, క్రియాశీలత్వమూ కాదు. ఈ రెండింటి మధ్య సమత్వమే. అందుకనే భగవద్గీతలో భగవానుడు రాగద్వేషాల కతీతంగా వెళ్ళాలన్నాడు. మనం రాగద్వేష రహితంగా వుండాలి. ఏ వ్యక్తయితే రాగద్వేషాలకతీతంగా ఎదిగి, మొత్తానికి తటస్థంగా వుండి, ధర్మకర్తగా వ్యవహరిస్తూ బాధ్యతలను స్వీకరిస్తాడో అతడే విరక్తుడు. అటువంటి వ్యక్తి ఒక్కడే వైరాగ్యం కలిగి వున్నాడని చెప్పబడినాడు.

రెండు మూడు సంవత్సరాల వయసుగల తన కుమారుని యొక్క బాధ్యత తాను తీసుకొనవచ్చునా అని ఒక వ్యక్తి అడిగారు. వైరాగ్యంపై చర్చించేటప్పుడు అడగవలసిన ప్రశ్న కాదది. ధర్మకర్తృత్వపు స్వభావముపై కలిగిన అవగాహనతో యివ్వబడిన సలహాలను దృష్టిలో వుంచుకొని అవి చేయవలసిన దైనందిన అంశములు. మన అధీనంలో వుంచబడిన వ్యక్తి ఏ అంతస్తుకు ఎదగగలడో ఆ అంతస్తుకు ఎదగడానికి దోహదపడగల అన్ని చర్యలను మనం చెయ్యాలి. కాని ఆ వ్యక్తి యిలాగవ్వాలి, అలాగవ్వాలి అని మనము అత్యుత్సాహం చూపించి అలా జరగనినాడు మనము యిబ్బందుల పాలవుతాం. ప్రస్తుతము ఎన్నిరకాల మార్పులు సాధ్యపడతాయో అన్ని రకాల మార్పులు చేపట్టినా కూడా గులాబి మొక్కను చింతచెట్టుగా మార్చలేము. మన అధీనంలో వుంచబడిన వ్యక్తిపై మనకుగల అనుచిత వ్యామోహమో లేక వాడు నా స్వంతమను భావనో యిక్కడ మనలను పొరపడేలా చేస్తుంది. నేను కేవలం యిక్కడొక ఉదాహరణ యివ్వడానికే ప్రయత్నంచేశాను. దాన్నేరంగానికైనా వర్తింపజేసుకోవచ్చు. మితతత్వమెక్కడుందో మనకు తెలుసు. అనుచిత వ్యామోహం వలన తల్లి తన తనయుడిని నాలుగు సార్లు తినమంటుంది. వాడుగాని సరైన అనుబంధం కలిగి వున్నట్లయితే 'వద్ద'ని చెబుతాడు. ఎక్కడ వద్దని చెప్పాలో అక్కడ వద్దని చెప్పడం వివేకమౌతుంది. దానిని నేర్చుకోకుండా మనం వైరాగ్యాన్ని నేర్చుకోలేము. ప్రతి నిత్యం వుండే సమస్యలే యివి. 'ఇదంతే' నని మనం చెప్పవలసి వచ్చినపుడు, అక్కడ మనం 'కాద'ని చెప్పినపుడు అక్కడ మన యొక్క బంధుత్వానికి హద్దులు నియమించామని కూడ అర్థం చేసుకోవాలి. అవతలి వ్యక్తి తన సంబంధాన్ని హద్దులకు మించి పెంచయత్నించినపుడు అతనికి వద్దని చెప్పడానికి ప్రయత్నిస్తాము. అదే దాని పరాకాష్ఠ. అక్కడ దాని స్థితి స్థాపక శక్తి ముగుస్తుంది. అనుభూతి రంగంలో గాని మనం కాదని ఏ విధంగా చెప్పగలమో తెలుసుకుంటే తక్కిన రంగాలలో సులువుగా నిర్వహించగలం. అది తెలుసుకోలేక

పోయినట్లయితే మన భావోద్రేకాలపై దెబ్బకొట్టబడటానికి (black mail) అవకాశం కలిగించే మొట్టమొదటి వ్యక్తులం మనమే అవుతాం. ఇది ప్రతిరోజు జరిగేదే. ఇది మన జీవితంలో ప్రతి రోజు జరుగుతుంది. ఎవడో black mail చేస్తుంటాడు. మన భావోద్రేకాలపై దెబ్బకొడుతుంటాడు. కారణం దానికెక్కడ చరమగీతం పాడాలో, ఆ అనుభూతులను ఏవిధంగా త్యజించాలో మనకు తెలియదు కనుక. దీనినెక్కడ తగ్గొట్టాలో, ఎక్కడ వేరుచెయ్యాలో మనం తెలుసుకోవాలి. అది తెలియని నాడు మనం కష్టాల్లో పడతాం. కాని యివన్నీ కూడా వైరాగ్యమనే శుద్ధమైన విషయముకన్నా అన్యమైనవి.

వైరాగ్యం పెంపొందవలెననిన "1ఎ' బిందువునుండి ప్రభావితం చేసే పనిని ప్రశిక్షకుడు చేయవలసి యుంటుంది. ఆ స్థానంలో స్థిరపడిన వ్యక్తి నీకు సిట్టింగ్ యిచ్చినట్లయితే ఆ మేరకు వైరాగ్యానుభూతి కలుగుతుంది. ఆ వైరాగ్యం నీకై నీ ఆర్తితో కోరుకొనేదే. నీవాస్థితిని గాని కోరుకోనట్లయితే దానినెవ్వరూ కూడా నీలోనికి చొప్పించలేరు. నేనెప్పుడూ చెబుతున్నట్లుగా నీకూ భగవంతునికి మధ్యగల వొడంబడిక రహస్యమైనదీ, ఖచ్చితమైనదీ కూడా. నీవిష్టపడితే తప్ప నీకర్మలో తలదూర్చే అధికారమెవ్వరికీ లేదు. పరివర్తన చెందడానికెవ్వరినీ బలవంతపెట్టలేము. పరివర్తన చెందడమనేది యిచ్ఛా సంకల్పములతో కూడిన పరిణామము. మనము పరివర్తన చెందాలనుకున్నాము కనుక పరివర్తన చెందాము. ఈ అంశం మాత్రం మీ మనస్సుల్లో స్పష్టంగా వుండాలి. మనం చూచినట్టుగా అవస్థలున్నాయి. కొన్ని అంశములయొక్క పరాకాష్ఠ మనం కోరకూడదు. మనం వేదాంతాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం వలన అది సంభవిస్తుంది. శ్రీ శంకరులు తమ ఆరవయేట సన్యసించారు కనుక నేనెందుకు కూడదనే ప్రశ్న అసంబద్ధం. ఎందుకంటే నీవు శంకరాచార్యులు కాదు కనుక. రెండవది నీ ప్రాధాన్యములు, ఆయన ప్రాధాన్యములు ఒక్కటే కాదు. ఆయన పని నీపని కన్న భిన్నమైనది. మనమంతా ఒకేరకమైన సంస్కారాలు కలిగియుంటామన్నట్లుగా భావింపవచ్చు కాని అక్కడ తేడా వుంటుందని గ్రహించాలి. మనలోని ప్రతివొక్కరికి వారివైన ప్రత్యేక సంస్కారాలు వుంటాయి. అయితే భగవంతుని గురించి ఆలోచించడం, స్వార్థానికి భిన్నమైనదేదో దానినిగురించి ఆలోచించడం మన అల్పత్వాన్నర్థము చేసుకుంటూ ఎదుటివాని గొప్పదనాన్ని అంగీకరించడమనే సామాన్య సంస్కారాలు మనందరిలోనూ వొక్కటిగానే చూస్తాము. దీనికి భిన్నంగా మనం మాట్లాడే విధానం, మసలే విధానం, అలంకరించుకొనే విధానం, మన జీవన విధానం, మనం కలిసి తిరిగే జనం యివన్నీ వేరు వేరుగా వుంటాయి. మన బంధుత్వాలు, మన బంధుత్వాలయొక్క తీవ్రత ప్రత్యేకంగా వుంటాయి. కనుక చెప్పొచ్చేదేమిటంటే ఆదిశంకరులకు ఏవైతే వర్తిస్తాయో అవి మనకు వర్తించవు. ఎందుకంటే మన గమ్యమది కాదు. మన గమ్యం వేరే. వివేకం అనే అంశంలో మాట్లాడుకున్నట్లు మన గమ్యం పైగల అవగాహనే యిబ్బందుల్లో పడింది. మన ఆదిమూలసారముయొక్క సత్‌తత్వమును అనుభవములోనికి తెచ్చుకొనుటే మన గమ్యమయినట్లయితే, ఆ ఎరుకకు నేనర్హుణ్ణే. ఏ ఎరుక మన ఆదిమూల సారముయొక్క సత్‌తత్వమును అనుభవము లోనికి తెచ్చునో ఆ ఎరుకే మనకు కలిగినట్లయితే మిగిలిన దేనిని గురించిన వాస్తవానుభవములపైన మనకక్కర వుండదు. ఆది మూల సారముయొక్క సత్‌తత్వమును అనుభవములోనికి తెచ్చుకొనుట యందే ఎల్లప్పుడు మనం శ్రద్ధపెట్టి ఉన్నట్టయితే సహజముగా మన వృత్తిపైగల ప్రాధాన్యము, మన తల్లిదండ్రులతో గల సంబంధ బాంధవ్యముల ప్రాధాన్యము, మన బిడ్డలతోగల సంబంధ బాంధవ్యముల ప్రాధాన్యము బాగా తగ్గు ముఖం పడతాయి కనుక

వారి గురించి ఎక్కువగా పట్టించుకోము. ఈ సందర్భంలో 'పిల్లలతో కలిసి వుండకు' అన్న పూజ్య లాలాజీ గారి వాక్యం గుర్తుకు వస్తుంది. ఈ వాక్యం పై ఎంతమంది ధ్యానించారో, ఎంతమంది నిధిధ్యాసనము చేశారో తెలియదు గాని దానికి కారణమేమిటంటే పిల్లలు కొత్తగా రూపుదిద్దుకొటున్నవారు, మనం యీ సృష్టినుండి వెనక్కు మళ్ళడానికి ప్రయత్నిస్తున్న వాళ్ళం కనుక యీ రెండూ పొందిక కుదరనివి, విరుద్ధమైనవి. మనము పిల్లలయొక్క సాన్నిధ్యంలో వారి ఆటపాటలతో మైమరచి పోతాము. ఆ ఆనందంలో మునిగిపోవడంవలన మన నిజతత్వసారాన్ని తెలుసుకోవడానికి శ్రద్ధగా మనం చేయవలసిన ప్రయత్నాన్నుండి దారి తప్పుతాం. కనుక మనం వాళ్ళని వదులుకోవాలా? అలా ఎన్నటికీ కాదు. ఎంతమేరకవసరమో అంతకుమించి వారితో బంధం పెంచుకోకుండా ఉచితరీతిని వారికి సేవ చెయ్యాలి. పిల్లలు నిస్సహాయులన్న ఒకే సాకుతో వాళ్ళ పై వ్యామోహాన్ని పెంచుకుంటూ మన ఆధిక్యతను వాళ్లపై మోపుతాము. పదేళ్లాగు ఆ బిడ్డ నీవు చెప్పేది వినడానికి సిద్ధంగా వుండడు. ఇరవైయేళ్ళాగు నీవు చెప్పేది నిరాకరిస్తాడు. ముప్పైయేళ్ళాగు తనకు తాను స్వతంత్రంగా యుంటాడు. మనం గారాబంచేసిన ఆ బిడ్డకేమయింది, మన అనుభూతులు ఏమయ్యాయి? ఆ అనుభూతులు మన హృదయంలోనే వున్నాయి. దురదృష్టవశాత్తు వాటికిగాని మనం శాశ్వతత్వము ఆపాదించు కున్నట్లయితే దశరథమహారాజుగారు లోనయినట్లు దుర్భర శోకానికి లోనవుతాం. ప్రభు శ్రీ రామచంద్రునిపై గల వ్యామోహమే ఆయన మరణానికి కారణమయింది. తన పుత్రుడు పెరిగి పెద్దవాడయినా కూడా ఆయన ఆ అనుభూతిని అలాగే అట్టిపెట్టుకున్నారు. విశ్వామిత్రమహర్షి నుడివిన ప్రకారం ఆయన తన పుత్రులను ఎదగనివ్వాలి. ఆయనకు "నీ కుమారులంతా దివ్యపురుషులు. వారు చెడును నిర్మూలించడానికి నియుక్తులు. నీవు వాళ్ళనాపవద్దు. వాళ్ళు నిర్వ ర్తించవలసిన దైవకార్యాన్ని నిర్వ ర్తించనీ" అని మహర్షి విశ్వామిత్రులు చెప్పారు. రాజు పుత్ర వ్యామోహంతో వాదిస్తుంటే "విశ్వామిత్రునికన్నీ తెలుసు కనుక నీ బిడ్డలను ఆయనకప్పగించడం శ్రేయస్కర" మని మహర్షి వశిష్టులు చెప్పారు. అయినా కూడా ఆయన ఆ పాఠం నేర్చుకోలేదు. శ్రీ రాముడు భగవంతునవతారమని తెలిసినాకూడ దశరథుడు తనకత్యంత ప్రీతిపాత్రమైన పుత్రవ్యాత్సల్యము, మమకార వ్యామోహములను వదలుకోవడానికి సిద్ధపడలేదు. పుత్రవ్యామోహమంటే యిదే. పూజ్యలాలాజీ మహారాజ్ గారి ఈ వాక్యముయొక్క ప్రాముఖ్యతను దయచేసి అర్థంచేసుకోండి. మనమర్థం చేసుకోవడానికి ఒకవిధమైన వివరణిచ్చారు. కాని మనలో చాలామంది కనీసం దాని గురించి ఆలోచించనైనా లేదు. ఆట మంచిదని మనం భావిస్తాం. ఆట చక్కనిదేగాని మంచిది కాదు. ఆటకు హద్దులున్నాయి. మన ఆటనెక్కడ ఆపాలో మనం తెలుసుకొని యుండాలి. అదేవిధంగా మన కార్యాలయం శ్రేష్ఠమైనదేగాని మంచిది కాదు. అది మనకు సంపాదించుకొనగలిగే అవకాశమిస్తుంది. అక్కడితో దాని ప్రాముఖ్యం ముగుస్తుంది. మనం మన కార్యాలయాన్ని గాని యింటికి మోసుకొని పోతే అది మనలను చెడగొడుతుంది. ఇతరులపైగల వ్యామోహాన్ని ధ్యానానికి గాని మోసుకొనిపోతే మనము వాటిలో మునిగిపోతాం. పలువిధాల అనుభూతులు, వ్యామోహాల కారణంగా మన వ్యాపారం మన ధ్యానంలో కలుగజేసుకున్నట్లయితే మన ధ్యానం పనిచెయ్యదు. మనం నాణ్య మైన ధ్యానాన్ని కోరుకొనేటట్లయితే ఈ అనుభూతులను త్యజించవలసినదే. సక్రమమైన విధానములో వాటిని పరిత్యజించ కుండా మనం చక్కగా ధ్యానం చేసుకోలేము. ఎందుకంటే అవి మాటి మాటికీ మన దారికి అడ్డువస్తుంటాయి. ఏదో ఎప్పుడైనా అయితే ఫరవాలేదు గాని రోజూ యిదే సమస్యయితే మంచిది కాదు. ఎంత కాలమయితే మనం మన పిల్లలపైగల వ్యామోహంలో తగుల్కొని యుంటామో అంతకాలము సమస్య యుంటుంది. అందుకనే

పుత్రేషణ, దారేషణ, ధనేషణలను వర్జించాలని చెబుతారు. ఎందుకంటే మనలనవి భగద్విషయంగా నాలోచించనివ్వవు. కాని మన విధానాలు అద్భుతం. భార్యా పుత్రాదులతో కలసి దైవం వద్దకు వస్తానని చెబుతాం. కాని మన ఆదిమూల సారం ప్రతివొక్కరిని వారి వారి యోగ్యతనుబట్టి అంగీకరిస్తుందిగాని దానితోగల బంధుత్వం వలనో సఖ్యతవలనో గాదు. పర్వత శిఖరాలపైగల మన దేవాలయాలు దైవాన్ని చేరేమార్గం చాలా యిరుకని అతి సుందరంగా వివరించాయి. ఆధునికకాలంలో ఈ క్షేత్రదర్శనాలకు చక్కని రహదారులు, మెరుగైన రవాణా సౌకర్యాల కారణంగా తీర్థయాత్రలు చాలా సులువైనాయి. పూర్వకాలంలో ఆ మార్గాలు ఇరుకుగాయుండి ఎప్పుడైనా లోయలోనికి జారిపడే ప్రమాదం పొంచి వుండేది. కొన్ని ప్రదేశాలలోనైతే ప్రాకుతూ ఎక్కవలసివచ్చేది. ఎందుకంటే అదొక్కటే దారి, మనం వెళ్ళడానికదొక్కటే యిరుకు మార్గం. మెడలో డోలుతో ఆ మార్గంగుండా పోలేము. సోదర ధర్మంగా మనం కొంతమందికి ఆ దారి చూపి సహాయపడగలం కాని మనంకూడా వారిని మోసుకొని పోలేం. కనుక ఈ బంధాలను, అనుభూతులను వదులుకోక తప్పదు. సత్సంగ్‌లను త్యజించవచ్చా? అని మనము అనడగవచ్చు. అలావీల్లేదు. మనమెప్పుడూ సత్సంగ్‌లను పరిత్యజించకూడదు. సత్సంగ్‌లు జరుపుకొంటూ సత్సంగీయులతోనే సాధ్యమయినంత మేరకు కలసి సాగిపోవాలి. అవసరయితే వొంటరిగానే సాగిపోవాలి. అందుకనే "సత్సంగంటే భగవంతునితోడి సహవాసమే" గాని అన్యులతో సావాసం కాదన్న పూజ్య లాలాజీ గారి వాక్యాన్ని హర్షిస్తాము. అందుకనే ఆ వాక్యభాగము వాస్తవంగా పూర్తి అర్థాన్ని సంతరించుకొన్నది. విషయమేమిటంటే మనం దైవాన్నెన్నటికీ త్యజించలేము. అదేవిధంగా దైవం కూడ మనలను త్యజించదు. అది మనలను రెండవ గ్రంథికి దారి తీస్తుంది, మనకు దైవానికిగల తిరుగులేని పరస్పరాధారాన్ని తెలియజేస్తుంది. మనము ఆయనతోనూ, ఆయన మనతోనూ సంబాళించుకోవడం కన్నా వేరే ప్రత్యామ్నాయం లేదు. మనమాస్థితికి చేరుకోవడానికి ముందు మనలో వైరాగ్యం స్థిరంగా నెలకొని వుండాలన్న గ్రహింపుండాలి. వ్యక్తులతోగాని, వస్తువులతోగాని, ఆలోచనలతోగాని, అనుభూతులతో గాని వుండే మన బంధాలు కేవలం అశాశ్వతమనే ఎరుకతో మన దృష్టంతా ఆయనపైనే నిలిపి, మనస్సును పూర్తిగా ఆయనపైనే లగ్నం చెయ్యాలి. ఈ స్థితికి వచ్చిన తరువాత "ఇదికూడ గతించి పోతుంద"ని తెలుసుకోవాలి. ఈ వాక్యాన్ని పునరుద్ఘాటిస్తున్నాను 'ఇదికూడ గతించి పోతుంది' అనే ఒక ఎరుకను మన హృదయాల్లో కలిగి యుండాలి. అప్పుడు వస్తువులపట్ల మన ప్రతిస్పందన కూడా చాలా ఎక్కువ స్థాయిలో మితంగా వుంటుంది. ఎదుటి వ్యక్తియొక్క అతిగా స్పందించే తీరును మనము అంగీకరించనప్పుడే, మితత్వం సాధ్యపడుతుంది. 'ఇది కూడా గతించి పోతుంద'నే దానిపై మనము ఒక్క నిముషము ఆలోచించినట్లయితే చివరకు కొంత సంతోషం పొందగలుగుతాము. ఇక్కడ మన స్వంతం కోసమై ఏ అనుబంధం కూడా సమర్థనీయం కాదు. కాని ధర్మకర్తగా యిక్కడున్న దేనిపట్లయినా అనుబంధం పెంచుకోవడం సబబుగానే యుంటుంది. మనం ధర్మకర్తలుగా వ్యవహరించినంత కాలం అనుబంధం కలిగే హక్కు వుంటుంది. కాని ఏ క్షణంలోనయితే మనము హద్దులు మీరి స్వార్థానికి లోనవుతామో తిరిగి కోలుకోలేని సమస్యలో కూరుకొని పోతాము.

(Translation of the article "Vairagya' pg 19-56: Bodayanthi Parasparam Vol.III)

అనువాదకులు: శ్రీ యం.వెంకటరత్నం